క్లుప్తంగా

రగ్బీ, ఆర్చరీ క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు

పిఠాపురం: స్థానిక ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ అండర్–19 బాలురు, బాలికల రగ్బీ, ఆర్చరీ ఎంపికలు శనివారం నిర్వహించారు. దీనికి 200 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ప్రతిభ చూపిన 24 మంది చొప్పున క్రీడాకారులను రగ్బీ, ఆర్చరీలకు ఎంపికయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ వి.కేశవరావు, మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ, కౌన్సిలర్లు రాయుడు శ్రీను, అల్లవరపు నగేష్ తదితరులు పోటీలను తిలకించారు. అండర్–19 స్కూల్ గేమ్స్ సెక్రటరీ శివరామకృష్ణ మాట్లాడుతూ విజేతలు త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రగ్బీ అసోసియేషన్ చైర్మన్ వియ్యపు రామన్నరాజు, అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి నాగేంద్రకుమార్, సీఈఓ నాగలింగేశ్వరరావు, న్యాయ నిర్ణేతలు నవీన్, వంశీ, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాట ముహూర్తం

కొత్తపల్లి: స్థానిక గాదులదొడ్డిలోని బాల కనకదుర్గమ్మ ఆలయం వద్ద నిర్వహించే దసరా ఉత్సవాలకు శనివారం రాట ముహూర్తం చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి పందిరి రాట వేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పంచారామ క్షేత్రంలో పూజలు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఏకాదశి పర్వదినం కావడంతో ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పంతులు వేమూరి సోమేశ్వరశర్మ, అల్లకి రాజ్‌గోపాల్‌శర్మ, సన్నిధిరాజు వెంకటరమణ, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్‌లు స్వామి వారికి అభిషేకాలు, పూజలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు.

జనసేన నేత గొడౌన్‌లో పేకాట శిబిరం

పిఠాపురం: గొల్లప్రోలు పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో మండల పరిషత్ కార్యాలయం వెనుక ఉన్న జనసేన నేత గొడౌన్‌లో కొన్ని నెలలుగా బహిరంగంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఎట్టకేలకు పోలీసులు శనివారం రాత్రి దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.25,870, రెండు మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు గొల్లప్రోలు పోలీసులు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. అధికార పార్టీ నేత కావడంతో ఇప్పటివరకు తెలిసీ తెలియనట్లు ఊరుకున్న పోలీసులు స్థానికులు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో చివరకు దాడి చేసినట్లు తెలిసింది.

వ్యాసరచనలో విద్యార్థికి జిల్లాస్థాయి ప్రథమ బహుమతి



భవ్యశ్రీ

సామర్లకోట: స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థిని కె.భవ్యశ్రీ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించినట్టు ఆ పాఠశాల హెచ్ఎం తోటకూర సాయిరామ కృష్ణ తెలిపారు. జిల్లా విద్యాశాఖ, వైద్య శాఖలు సంయుక్తంగా నిర్వహించిన ' సేవ్ గర్ల్ చైల్డ్' అనే అంశంపై జిల్లా స్థాయి పోటీలో ప్రథమ బహుమతి పొందిందన్నారు. రూ.ఐదు వేలు నగదు పారితోషకం లభించనుంది. ఈ విద్యార్థిని హెచ్ఎం సాయిరామకృష్ణ, విద్యా కమిటీ చైర్మన్ అక్కిన చక్రధర్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఏఎన్ఎం కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం

సామర్లకోట: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఏఎన్ఎం నాగ సత్యవేణి మృతి చెందడంతో మండల పరిధిలోని సచివాలయ కార్యదర్శుల ఇచ్చిన విరాళాన్ని ఆమె కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే రాజప్ప చేతుల మీదుగా ఎంపీపీ సత్తిబాబు అందజేశారు. సచివాలయ సిబ్బంది రూ.1.20 లక్షలు ఇచ్చారని దానిని ఇద్దరు కుమార్తెల పేరున డిపాజిట్టు చేస్తామని ఎంపీడీఓ డి.శ్రీలలిత తెలిపారు. మండల పరిధిలోని అధికారుల నుంచి సొమ్ము సేకరణ చేసి అందజేస్తామని ఆమె చెప్పారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందేలా చూస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ప్రభుత్వ పెన్షనర్ల సంఘ అధ్యక్షుడిగా పల్లేశ్వరరావు

సామర్లకోట: ప్రభుత్వ పెన్షనర్ల పట్టణ సంఘ అధ్యక్షుడిగా ఆర్‌వీ పల్లేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వివిధ ప్రభుత్వ శాఖలల్లో పని చేసి పదవీ విరమణ చేసిన విశ్రాంత ఉద్యోగులు శనివారం సాయంత్రం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమావేశమై నూతన సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. కాకినాడ జిల్లా అధ్యక్షుడు ఎంవీ వీరభద్రస్వామి, కార్యదర్శి ఎస్ఎం రామారావుల ఆధ్వర్యంలో నూతన సంఘ ఎన్నిక జరిగింది. సంఘ కార్యదర్శిగా జీవీ రాఘవ, ఉపాధ్యక్షుడిగా సిద్దా సూర్యనారాయణ, కోశాధికారిగా ముప్పిన డేనియల్ వరప్రసాద్, సహాయ కార్యదర్శిగా ఎస్.సత్యంనాయుడు, ఎగ్జిక్యూటివ్ సభ్యురాలుగా బి.రాజేశ్వరీ ఎన్నికయ్యారు.

మా మతం మానవత్వం



ఆలయంలో ప్రదక్షిణలు చేస్తున్న దొరబాబు, కార్యకర్తలు



ఆలయం వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దొరబాబు

- తిరుపతిలో కల్తీ నెయ్యి కూటమి నేతల నాటకం
- చంద్రబాబుకు సద్బుద్ధి ప్రసాదించాలంటూ ప్రత్యేక పూజలు
- వెంకన్న సాక్షిగా కూటమి ప్రభుత్వం తప్పుడు ప్రచారం
- పెద్దాపురం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు

పెద్దాపురం: మా మతం మానవత్వం అదే వైఎస్సార్ సీపీ నినాదం, తిరుపతి వెంకన్న సాక్షిగా తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్న కూటమి నేతలకు సద్బుద్ధి ప్రసాదించాలంటూ పెద్దాపురం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు కోరుతున్నారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శనివారం స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో సీఎం చంద్రబాబు నాయుడు బుద్ధి మారాలంటూ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, పెద్దాపురం మున్సిపల్ చైర్మన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్లు నెక్కంటి సాయి ప్రసాద్, ఊబా జాన్ మోజెస్, ఎంపీపీలు పెంకే సత్యవతి, బొబ్బరాడ సత్తిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, పార్టీ మండల యూత్ నాయకులు గోపు మురళి. ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ బండారు వీరబాబు, కాళ్ల లక్ష్మీనారాయణ, పార్టీ నాయకులతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు మాట్లాడుతూ తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్తీ నెయ్యి ఘటన కూటమి నేతల క్రియేషన్ అన్నారు. వేంకటేశ్వర స్వామి సాక్షిగా కూటమి నేతలు తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్నారన్నారు. తప్పుడు ప్రచారాలకు పాల్పడిన ప్రతి ఒక్కరికి తప్పకుండా భగవంతుడు వేసే శిక్షకు గురవుతారన్నారు. మతాల మధ్య చిచ్చు పెట్టేలా కూటమి నేతలు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారన్నారు. చంద్రబాబుకు సద్బుద్ధిని కల్పించి కోరుతున్నామని దొరబాబు అన్నారు. అనంతరం ఆలయం చుట్టూ ప్రదక్షిణలు జరిపి, కొబ్బరికాయలు కొట్టి వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోరంపూడి శ్రీరంగనాయకులు, పార్టీ పట్టణ అధ్యక్షుడు కాపగంటి కామేశ్వరరావు, కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, విడదాసరి రాజా, సర్పంచులు కనపర్తి చీమదొర, ఒబిలిశెట్టి అబ్బాయి, కొత్త చక్రరావు, న్యాయవాదుల జిల్లా సంఘం అధ్యక్షులు కందుల వెంకటాచలం, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, కతారి రాజా, యినకొండ వీర విష్ణు చక్రం, నాగబోయిన రాజుబాబు, నల్లల గోవిందు, పెంటా విజయ్‌కుమార్, మేడిశెట్టి భద్రం, సయ్యద్ జానీ, బంగారు కృష్ణ, కనపర్తి బాబి, సుందరెడ్డి రాజు, తలారి దొరబాబు, అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

2 నుంచి మేడపాడు రైల్వే గేటు మూసివేత

ఐదు గ్రామాల ప్రజలకు ఇబ్బంది

సామర్లకోట: వచ్చే నెల రెండో తేదీ నుంచి ఏడో తేదీ వరకూ జి.మేడపాడు రైల్వే గేటు మూసి వేస్తున్నట్టు రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీరు రామసుబ్బారావు తెలిపారు. రైల్వే గేటు వద్ద ఉన్న ట్రాకు మరమ్మతుల కారణంగా గేటు మూసి వేయాల్సిన వస్తోందని ఆయన చెప్పారు. మేడపాడు రైల్వే గేటు ఆవలి వైపు ఉన్న గ్రామానికి చెందిన నాలుగు వార్డుల ప్రజలు సుమారు 4వేల మంది నివాసం ఉంటున్నారు. అటువైపే హైస్కూల్ ఉంది. అలాగే జి.కొత్తూరు, రాయభూపాల పట్నం, చిన్న బ్రహ్మదేవం, మర్రిపూడి గ్రామాలకు చెందిన ప్రజలకు ఈ రైల్వే గేటు మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. ప్రస్తుతం దసరా సెలవు కాబట్టి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. మేడపాడు గ్రామానికి చెందిన సగ్గు బియ్యం, రైలు మిల్లుల యజమానులకు ఎక్కువ ఇబ్బంది కలుగుతుంది. రైల్వే గేటు సమీపంలో రైలు ట్రాకు దిగువ భాగంలో కాను ఉండడంతో మోటారు సైకిళ్లపై రాకపోకలు చేయడానికి అవకాశం ఉంది. భారీ వాహనాలపై రాకపోకలు చేసే వారు పంచాయతీ కార్యాలయానికి చేరుకోవాలంటే సుమారు 10 కిలోమీటర్లు తిరిగి రావాల్సిన ఉంటుంది. రైల్వే గేటు ఆవలి వైపు ఉన్న గ్రామాలకు చెందిన వారు ఏడీబీ రోడ్డు మీదుగా గమ్యాలకు చేరాల్సి ఉంటుంది. ఈ మేరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని జి.మేడపాడు, జి.కొత్తూరు, రాయభూపాలపట్నం, చిన్నబ్రహ్మదేవం, మర్రిపూడి గ్రామాల సర్పంచులకు, పోలీసు అధికారులకు, తహసీల్దార్‌కు సమాచారం అందజేసినట్టు రామసుబ్బారావు తెలిపారు. ఈ అసౌకర్యాన్ని ఆయా గ్రామ ప్రజలు గమనించాలన్నారు.

పూర్తి స్థాయిలో నష్ట పరిహారం ఇవ్వాలి



పొన్నాడలో అధికారులకు వినతిపత్రం అందిసస్తున్న సీపీఎం నాయకులు

కొత్తపల్లి: ఏలేరు వరద ముంపు బాధితులకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో నష్ట పరిహారం ఇవ్వాలని సీపీఎం నాయకుడు కాళ్ల నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు శనివారం పొన్నాడ గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి, గ్రామా రెవెన్యూ అధికారికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలేరు వరద కారణంగా నాగులపల్లి–మూలపేట రోడ్డు పూర్తిగా ముంపునకు గురికావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. పరిహారం విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. బాధితులకు పూర్తిస్థాయిలో పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చీకట్ల సాంబశివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కంటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి



కంటిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్న డాక్టరు మాధురి

సామర్లకోట: విద్యార్థులు కంటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని స్థానిక కంటి వైద్య నిపుణులు డాక్టరు ఎస్.మాధురి అన్నారు. స్థానిక బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని మాధురి ప్రారంభించారు. పిల్లలు చిన్నతనం నుంచే సెల్ ఫోన్లు చూడడంవల్ల కంటికి ప్రమాదం జరిగే అవకాశం ఉన్నదన్నారు. ఎక్కువగా టీవీ చూడడం ఇబ్బందులు ఏర్పడతాయన్నారు కంటిలో నలక పడిన సమయంలో కంటిని నలుపొద్దని, మెత్తని గుడ్డతో కంటిపై అద్ది, కంటిని స్వచ్ఛమైన నీటిలో ఉంచాలన్నారు. అప్పటికీ నలక రాకపోతే డాక్టర్లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమానికి పాఠశాల హెచ్ఎం తోటకూర సాయిరామ కృష్ణ అధ్యక్షత వహించగా ఉపాధ్యాయులు పాల్గొన్ని డాక్టరు మాధురిని సత్కరించారు.

యండపల్లిలో 'మన ఇల్లు- మన గౌరవం'



సమావేశంలో మాట్లాడేతున్న ఎంపీ ఉదయశ్రీనివాస్

కొత్తపల్లి: మండలంలోని యండపల్లిలో శనివారం మన ఇల్లు–మన గౌరవం కార్యక్రమం నిర్వహించారు. కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గృహ నిర్మాణ లబ్దిదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలు శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

స్త్రీ, శిశు సంక్షేమ అభివృద్ధికి ప్రభుత్వం కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిన రాజప్ప

పెద్దాపురం: స్త్రీ, శిశు సంక్షేమ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప అన్నారు. స్థానిక వెలమ కల్యాణ మండపంలో శనివారం ఐసిడిఎస్ సీడీపీఓ ఉష అధ్యక్షతన జరిగిన పోషణ మాసోత్సవాల సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిన రాజప్ప మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు, బాలల పరిరక్షణకు ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అందజేస్తుందన్నారు. అనంతరం గర్భిణులు సామూహిక సీమంతాలు, శిశువులకు అన్నప్రసన్న కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ, మున్సిపల్ చైర్మన్ బొడ్డు తులసీ మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ పరిశుభ్రం



సామర్లకోట రైల్వే స్టేషన్ ప్లాటు ఫారంను శుభ్రం చేస్తున్న స్టేషన్ మేనేజర్ రమేష్ తదితరులు

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్‌ను ప్లాస్టిక్ రహిత రైల్వే స్టేషన్‌గా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్టేషన్ మేనేజరు ఎం.రమేష్, చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టరు కల్యాణి అన్నారు. స్థానిక రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛత హీ సేవా పక్షోత్సవాలలో భాగంగా ప్లాటు ఫారం, రైల్వే కార్యాలయాలను శనివారం శుభ్రం చేశారు. ఈ మేరకు రైల్వే స్టేషన్ ఆవరణలో రైల్వే ఉద్యోగులు, సిబ్బంది, ప్రయాణికులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. అక్టోబరు రెండు నుంచి రైల్వే స్టేషన్ ఆవరణలో పూర్తిగా ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉంటుందన్నారు. అప్పటి వరకు ప్రజలను, ప్రయాణికులను అవగాహన కల్పించాలన్నా రు. ఈ మేరకు రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛత అవగాహన ర్యాలీ నిర్వహించారు. చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌కుమార్, ఆర్పీఎఫ్ ఎస్సై రామకృష్ణ పాల్గొన్నారు.

కమిషనర్‌ను సస్పెండ్ చేయాలి

- గొల్లప్రోలు నగర పంచాయతీ సమావేశంలో కౌన్సిలర్లు డిమాండ్
- సమావేశం నుంచి వాకౌట్ చేసి ఆందోళన
- రసాభాసగా కౌన్సిల్ సమావేశం



గొల్లప్రోలు నగర పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కౌన్సిలర్లు

పిఠాపురం: ప్రజలతో ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నుకైన సభ్యులను పక్కన పెట్టి అంతా తానే అన్నట్టుగా వ్యవహరిస్తున్న కమిషనర్‌ను సస్పెండ్ చేయాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. గొల్లప్రోలు నగర పంచాయతీ కార్యాలయంలో శనివారం చైర్‌పర్సన్ గండ్రేటి మంగతాయారు అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. కౌన్సిలర్లు ఆందోళనలతో సమావేశం రసాభాసగా జరిగింది.

సమావేశం ప్రారంభం కాగానే ఇటీవల 18వ వార్డులో పలు అభివృద్ధి కార్యక్రమాలను కౌన్సిలర్లకు సమాచారం ఇవ్వకుండా మున్సిపల్ కమిషనర్ చేయడంపై వివరణ ఇవ్వాలని కౌన్సిలర్లు పట్టుబట్టారు. సభ్యులు ఉండగా వారిని బేఖాతరు చేసి కార్యక్రమాలు నిర్వహించిన కమిషనర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. దీనిపై అధికారులు సమాధానం ఇవ్వబోతుండగా కౌన్సిలర్లు నేలపై కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని చైర్‌పర్సన్ గండ్రేటి మంగతాయారుకు అందజేశారు.

నామినేషన్ పద్ధతిలో వీధి లైట్లు వేయడంపై..

నగర పంచాయతీలో ఇటీవల వీధిలైట్లు వేశారు. ఎటువంటి టెండర్ వేయకుండా నామినేషన్ పద్ధతిపై లైట్లు వేసినట్లు అధికారులు చెబుతున్నారని, అలా చేయడం ఏమిటని కౌన్సిలర్లు ప్రశ్నించారు. వరదల నేపథ్యంలో అత్యవసరంగా నామినేషన్ పద్ధతిలో లైట్లు కొనుగోలు చేసి వేసినట్టు అధికారులు చెప్పగా కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. కమిషనర్ తీరుకు నిరసనగా వాకౌట్ చేసిన కౌన్సిలర్లు చైర్‌పర్సన్ గండ్రేటి మంగతాయారుతో కలిసి కార్యాలయం బయట గేటు వద్ద కమిషనర్‌కు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. సభ్యుల అధికారాలకు భంగం కలగజేయడంతో పాటు ప్రోటోకాల్ పాటించకుండా వ్యవహరించిన కమిషనర్‌ను సస్పెండ్ చేసే వరకు తాము ఊరుకునేది లేదని సభ్యులు ఆందోళన చేశారు. కమిషనర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రోటోకాల్ ఉల్లంఘనపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ టి.రవికుమార్ మాట్లాడుతూ సభ్యులను కించపరచాలన్నది తన ఉద్దేశం కాదన్నారు. అనుకోకుండా కార్యక్రమాలు నిర్వహించాల్సి వచ్చిందని వివరణ ఇచ్చినా సభ్యులు వ్యతిరేకించారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ తెడ్లపు అలేఖ్యారాణి, వైస్ చైర్మన్ గంధం నాగేశ్వరరావు, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నేడు లయన్స్ నూతన సభ్యులకు ఓరియంటేషన్

సామర్లకోట: జిల్లా లయన్స్ క్లబ్‌లో నూతనంగా 250 మంది సభ్యులు చేరడంతో వారికి ఆదివారం స్థానిక రైతుల క్లబ్ భవనంలో ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ చిత్తూలూరి వీరరాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ ఈదల ఈశ్వర కుమార్ అధ్యక్షత వహిస్తారని చెప్పారు. జిల్లా గవర్నర్‌గా ఈశ్వరకుమార్ బాధ్యతలు స్వీకరించిన తరువాత నూతనంగా ఏర్పడిన క్లబ్‌లు, సభ్యులను పరిచయ కార్యక్రమం ఉంటుందన్నారు.

వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే...



పిఠాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న వంగా గీత, పార్టీ శ్రేణులు

- చంద్రబాబు డైవర్షన్ రాజకీయాలు
- కూటమి నేతల తీరుపై వైఎస్సార్ సీపీ పిఠాపురం ఇన్‌చార్జి వంగా గీత మండిపాటు
- వెంకన్న ఆలయంలో ప్రత్యేక పూజలు

పిఠాపురం: కూటమి ప్రభుత్వ 100 రోజుల పాలనలో వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే సీఎం చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత అన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు శనివారం ఉదయం పిఠాపురం పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వంగా గీత మాట్లాడుతూ శ్రీవారి లడ్డూ విశిష్టతకు, తిరుమల పవిత్రతకు కూటమి నేతలు భంగం కలిగించారని, కూటమి నేతలు చేసిన పాపాన్ని ప్రక్షాళన చేయడంతో పాటు స్వామివారి ఆగ్రహం రాష్ట్ర ప్రజలపై పడకూడని ప్రార్థించామన్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక అన్ని వ్యవస్థలను స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని మండి పడ్డారు. చివరకు కలియుగ దైవమైన వేంకటేశ్వరస్వామిని కూడా వాడుకోవడం దురదృష్టకరమన్నారు. ప్రపంచమంతా వేంకటేశ్వరస్వామిని భక్తిశ్రద్ధలతో పూజిస్తారని, ఎంతో విశిష్టత ఉన్న తిరుమల లడ్డూపై దుష్ప్రచారం చేయడం బాధాకరమన్నారు. లడ్డూను స్వార్థ రాజకీయాల కోసం ప్రభుత్వం వాడుకున్నట్టు ప్రజలకు తెలిసిపోయిందని, అందుకే తిరుమల పర్యటనకు జగన్ వెళ్తుంటే అడ్డంకులు సృష్టించారని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి అల్లరిమూకలను తీసుకొచ్చి మత కలహాలు సృష్టించాలనుకున్నారని ఆమె ఆరోపించారు. దీనిలో జనసేన, బీజేపీ భాగస్వాములు కావడం దురదృష్టకరమన్నారు. చంద్రబాబు ఘోర అపచారం చేసిన నేపథ్యంలో చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలని, స్వామివారి ఆగ్రహం ప్రజలపై పడకుండా ఉండాలనే ఆలయాల్లో పూజలు చేసినట్లు తెలిపారు. డిక్లరేషన్ పేరుతో కుట్రలు చేశారని మండిపడ్డారు. వైఎస్ జగన్ సీఎం కాక ముందు, సీఎం అయ్యాక కూడా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలనలో పూర్తిగా వైఫల్యం చెందిందని, సూపర్ సిక్స్ హామీలను అమలు చేయలేకపోయారని విమర్శించారు. నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పీఠంలో రాట ముహూర్తం



భువనేశ్వరీ పీఠంలో దేవీ నవరాత్రులకు పందిరి రాట వేస్తున్న భక్తులు

పెద్దాపురం: స్థానిక వర్జుల వారి వీధిలో ఉన్న భువనేశ్వరి పీఠంలో దేవీ నవరాత్ర ఉత్సవాలను పురష్కరించుకుని శనివారం పందిరి రాట ముహూర్తం చేశారు. పీఠాధిపతి చింతా గోపిశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో వేములు సత్యసాయి ప్రసాద్, అరుణ దంపతులతో ఉదయం 9.23 గంటలకు పందిరి రాటను వేశారు. ఈ సందర్భంగా గోపిశర్మ సిద్ధాంతి మాట్లాడుతూ గత 25 ఏళ్లుగా అమ్మవారి పీఠంలో నవరాత్ర ఉత్సవాలు చేస్తున్నామన్నారు. వచ్చే 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్టు తెలిపారి. ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుంచి సాయంత్ర 6 గంటల వరకు అమ్మవారి పూజలుంటాయన్నారు. హోమాలు, పూజల్లో పాల్గొవాలనుకునేవారు 98661 93557, 88975 54557 నంబర్లను సంప్రదించాలని గోపిశర్మ సిద్ధాంతి కోరారు.

శృంగార వల్లభుడి ఆలయానికి భక్తుల తాకిడి

శనివారం ఒక్క రోజే స్వామి వారికి రూ.2.29 లక్షల ఆదాయం



తిరుపతి శృంగారవల్లభ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

పెద్దాపురం: తొలి తిరుపతి స్వయంభూ శృంగార వల్లభుడి ఆలయానికి శనివారం భక్తులు బారులు తీరారు. ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందుల తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. స్వామి వారికి ప్రీతికరమైన రోజు కావడంతో అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు స్వామి వారిని పూలమాలికలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని వివిధ సేవల టిక్కెట్లు, అన్నదానం, కేశఖండన ద్వారా స్వామి వారికి రూ.2,29,160 ఆదాయం సమకూరినట్టు ఈఓ శ్రీనివాస్ తెలిపారు.. ఈ సందర్భంగా సుమారు తొమ్మిది వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకోగా సుమారు మూడు వేల మంది అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు, గ్రామ సర్పంచ్ మొయిళ్ల కష్ణమూర్తి, మొయిళ్ల రాయన్న, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలకు కొమ్ము కాస్తున్న అధికారులు

- పంచాయతీ ఎన్ఓసీ లేకుండా రెన్యూవల్
- మండల పరిషత్ సమావేశంలో ఎంపీటీసీ ధ్వజం
- ప్రైవేటు పాఠశాలలపై దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే ఆదేశం



విద్యాశాఖాధికారిని వివరణ కోరుతున్న ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట: ప్రైవేటు పాఠశాలలకు అధికారులు కొమ్ము కాస్తున్నారని, దాంతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కుంటు పడుతోందని పీబీ దేవం ఎంపీటీసీ సభ్యుడు మలకల సూరిబాబు ధ్వజమెత్తారు. శనివారం సాయంత్రం ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అధ్యక్షతన మండల పరిషత్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యాశాఖాధికారి వై.శివరామకృష్ణ పాఠశాలల ప్రగతి వివరిస్తున్న సమయంలో మలకల సూరిబాబు కలుగజేసుకొని పీబీ దేవం గ్రామంలో ప్రైవేటు పాఠశాలను ఏవిధంగా రెన్యూవల్ చేశారని ప్రశ్నించారు. పంచాయతీ ఎన్ఓసీ లేదని, ఆస్పత్రి, అగ్నిమాపక అధికారుల ఎన్ఓసీ వేరు వేరు డోర్ నంబర్ల ఉన్నాయని అటువంటిది పాఠశాల రెన్యూవల్‌కు సిఫార్సు చేయడం దారుణమని అన్నారు. పంచాయతీ అనుమతి లేకుండా భవన నిర్మాణం కట్టడమే కాకుండా పంచాయతీకి రూ.30 లక్షలు పన్ను బకాయి ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రైవేటు పాఠశాల నిర్వాహణపై కమిటీ వేసి విచారణ చేసి పంచాయతీకి రావాల్సి ఆదాయం వచ్చేలా చూడాలన్నారు. దీనిపై వివరణ ఇవ్వాలని ఎమ్మెల్యే ఎంఈఓను ఆదేశించారు. పాఠశాల యజమాని కోర్టు నుంచి ఉత్తర్వులు తీసుకొని రావడంతోనే రెన్యూవల్ కేవలం ఒక ఏడాదికి మాత్రమే చేశారని ఎంఈఓ తెలిపారు. పన్నులు చెల్లించని వాటిపై విచారణ చేయాలని ఎమ్మెల్యే రాజప్ప ఎంఈఓను ఆదేశించారు. మండల పరిధిలో 1516 ఎన్టీఆర్ ఇళ్లను గుర్తించగా ఎంత మందికి బిల్లులు వేశారని ఎంపీపీ సత్తిబాబు హౌసింగ్ ఎఈ మోహిద్దీన్‌ను ప్రశ్నించారు. సర్వేకు మాత్రమే తమకు ఆదేశం వచ్చిందని ఏఈ చెప్పారు. బ్రహ్మానందపురం లే అవుట్‌కు వెళ్ల మార్గంలో తూరలను తొలగించడం వలన రైతులు ఇబ్బందికి పడుతున్నారని వైస్‌ఎంపీపీ పేర్నిడి వెంకట్రాయుడు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే మార్గం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే పంచాయతీ రాజ్ అధికారి కె.శ్రీనివాసరావు ఆదేశించారు. మండలానికి మంజూరు అయిన రూ.4.80 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు తయారు చేసినట్టు పంచాయతీరాజ్ అధికారి తెలిపారు.

కలిసి కట్టుగా అభివృద్ధికి కృషి చేయాలి

నియోజకవర్గం అభివృద్ధికి అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్పపిలుపు నిచ్చారు. మండల పరిషత్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గానికి రూ.25 కోట్లు మంజూరైనట్టు చెప్పారు. నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే నిధులు రూ.4.80 కోట్లతో వివిధ పనులకు ఆమోదం తెలిపారు. జెడ్పీటీసీ సభ్యురాలు ఎలిశెట్టి అమృత, ఎంపీడీఓ డి.శ్రీలలిత పాల్గొన్నారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఎలిశెట్టి అమృత, ఎంపీడీఓ శ్రీలలిత, తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.